క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జీడిమెట్ల సబ్‌స్టేషన్ ఏఈ వెంకటనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ వెంకటాద్రి ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు గంపల బస్తీ, లాస్ట్ బస్టాప్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవిజె జేమ్స్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అవిజె జేమ్స్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, దళిత సంఘాల నేత అవిజె జేమ్స్ డాక్టరేట్ అందుకున్నారు. తమిళనాడు హోసూర్‌లోని క్లారిస్టా హోటల్ రిసార్ట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో జేమ్స్ ఏషియన్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ కల్చరల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

పోరాటంతోనే హక్కుల సాధన



కుత్బుల్లాపూర్: పోరాటాల ద్వారా మాదిగల హక్కులను సాధించుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాదగిరి మాదిగ అన్నారు. ఈ నెల 25న శామీర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని మాక్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మాదిగ మహాసభ పోస్టర్‌ను శనివారం దేవేందర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వేషన్ల వర్గీకరణ, ఇతర హక్కులను సాధించుకునేందుకు మాదిగలు, ఉప కులస్తులు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిలువేరు శ్రీనివాస్‌మాదిగ నరసింహులు, సాంబ, కొమ్ము వినయ్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీ కరపత్రాల పంపిణీ



నిజాంపేట్: మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్‌లో బీజేపీ నాయకులు గడపగడపకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రానికి కేటాయించిన నిధుల వివరాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరిచి తెలంగాణాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు సహకరించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రవి యాదవ్, పార్లమెంటరీ మీడియా సెల్ కో కన్వీనర్ సుమన్ రావు, ఈసీ మెంబర్ సతీష్‌కృష్ణ, సీనియర్ నాయకులు రవికుమార్, సందీప్ యాదవ్, రాఘవేంద్ర ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



దుండిగల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని రిటైర్డ్ అటవీ శాఖ ముఖ్య అధికారి రఘువీర్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని శిఖర స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సర నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘువీర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ హేమలత మాట్లాడుతూ విద్యార్థులకు చదువు పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంటికీ గోదావరి నీళ్లు

దుండిగల్: ప్రతి ఇంటికి గోదావరి జలాలు అందించి, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం ఆయన బౌరంపేట ఇందిరమ్మ సముదాయంలో మంచి నీటి సరఫరాపై జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. రూ.6 కోట్ల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న ప్రత్యేక లైన్ లైన్ పనులకు ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను ఆదేశించారు.

- 40 గజాల్లో ఇంటి నిర్మాణం చేపడితే గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకుని నోటీసులు జారీ చేశారని, పక్కనే బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేస్తే కక్షకట్టి తమపైనే కుట్ర పన్నుతున్నారని ఓ మహిళ ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఆయన ఉప కమిషనర్ ప్రశాంతితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.
- సూరారం రాజీవ్‌గృహ కల్ప సమీపంలోని ఇద్దరు అనాథ విద్యార్థులకు ఫీజులు చెల్లించే విషయంలో సహాయం చేయాలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.
- బీఆర్ఎస్ సీనియర్ నేత కేఎం ప్రతాప్ పుట్టినరోజు సందర్భంగా శంభీపూర్ రాజు ఆయన నివాసానికి వెళ్లి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి తదితరులు ఉన్నారు.



కేఎం ప్రతాప్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



షాపూర్‌నగర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ముదిరాజ్ సంఘం జర్నలిస్టులు

రంగారెడ్డినగర్: ముదిరాజ్ కులస్తుల పట్ల అనుచితంగా మాట్లాడటమేగాక జర్నలిస్ట్ బండి అంజయ్ ముదిరాజ్‌పై దాడికి పాల్పడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం షాపూర్‌నగర్ చౌరస్తాలో ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్, ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బక్కని పాండు ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కించపరచడం దారుణమని, ఆయన వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలన్నారు. కుల వివక్ష పాటిస్తున్న కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుండి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మకు శవ యాత్ర నిర్వహించి దహనం చేశారు. ఎమ్మెల్సీ క్షమాపణలు చెప్పకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని జర్నలిస్ట్ సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు దమ్మని కుమారస్వామి, సంయుక్త కార్యదర్శి తోడేటి సత్యం ముదిరాజ్, నందిగామ సత్యనారాయణ, కొల రవీందర్ ముదిరాజ్, అశోక్, తెలంగాణ ఉద్యమకారుడు గుమ్మడి మధుసుధన్ రాజు, నాయకులు ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్, గరిగే శేఖర్ ముదిరాజ్, జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ ఎల్లంపల్లి నర్సింహులు ముదిరాజ్, మారి జ్ఞానేశ్వర్, దమ్మని యశ్వంత్ ముదిరాజ్, శివ ముదిరాజ్, రామకష్ణ, విగ్నేష్, లక్ష్మన్, వరదరాజు, విష్ణు, నితిన్, రమేష్, చిన్న, నవీన్, బాలరాజు, మానెయ్య, ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం కుత్బుల్లాపూర్ గౌరవ అధ్యక్షులు బాన్సువాడ వెంకటేష్ ముదిరాజ్, అధ్యక్షులు జెల్ల శివ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కావలి మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం చింతల్‌లోని కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు రూ.22.61,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని, ప్రభుత్వ పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ సంజీవిని వంటిదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- గాజులరామారం జేఎన్‌యూఆర్‌ఎంలో ప్రగతి యాత్రలో భాగంగా పర్యటించిన ఎమ్మెల్యే స్థానికంగా పూర్తయిన భూగర్భ డ్రైనేజీ, నూతనంగా చేపడుతున్న పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, డీఈఈ రూపా దేవి, ఏఈ కళ్యాణ్, డీజీఎం అప్పలనాయుడు, మేనేజర్ రోహిణి తదితరులు ఉన్నారు.
- గాజులరామారంలో రూ.7 కోట్ల వ్యయంతో చేపడుతున్న క్రీడా సముదాయాన్ని ఎమ్మెల్యే వివేకానంద్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండోర్ క్రికెట్, ఫుట్ బాల్ కోర్టులు, ఐదు షటిల్ కోర్టులు, బాస్కెట్‌బాల్ కోర్టు, రన్నింగ్ ట్రాక్ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్..

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయండి

నిజాంపేట్: సామాజిక సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు పరచడానికి ముందుకు రావాలని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. శనివారం ప్రగతినగర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌కు బీఆర్ఎస్ నిజాంపేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్, కిచెన్ సామాగ్రిని సమకూర్చగా వాటిని ధన్‌రాజ్‌యాదవ్ చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాలతకు అందజేశారు. కార్యక్రమంలో థశరత్,హరి, సాంబాశివ రెడ్డి మిత్ర బృందం, ఉపాధ్యాయులు ప్రసన్న భారతి, శ్రీనివాస్ రెడ్డి, దిన్కర్, భద్రయ్య, చెన్నయ్య, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.



కిచెన్ సామగ్రి అందజేస్తున్న డిప్యూటీ మేయర్, ధన్‌రాజ్‌యాదవ్ తదితరులు

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్, ఉమామహేష్

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు కాలుకాని లక్ష్మణ్, ఉమామహేష్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో వామపక్షాల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహదూర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం నిరుపయోగంగా మారడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. వెంటనే లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటాయిస్తే వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కొందరు దళారులు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో జులై 1 నుంచి 8 వరకు కుత్బుల్లాపూర్ మండల పరిధిలో 8 డివిజన్లలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారిని కలుస్తామని, ప్రభుత్వం ఇళ్లను కేటాయించడంలో చేస్తున్న జాప్యాన్ని ఎండగడతామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు స్వామి, హరినాథ్, మండల సహాయ కార్యదర్శి రాము, కోశాధికారి సదానంద, సీపీఎం మండల కమిటీ సభ్యులు సలీం, శంకర్, శాఖ కార్యదర్శులు స్వాతి, దేవదానం యువజన సంఘం నాయకులుభాషా, ఆది, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం ఆయన గాజులరామారం డివిజన్ ప్రకాశం పంతులు నగర్‌లో ఓపెన్ నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా నాలాలో వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని బస్తీ వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నాలాల్లో పూడికతీతకు రూ.కోట్లు వెచ్చిస్తున్నట్లు లెక్కలు చూపుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. కమీషన్లకు ఆశపడి పూడిక తొలగించకున్నా అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. నాలా పూడికపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీపీనగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, కాలనీ వాసులు బుజ్జి, చంద్రకాంత్, విజయ్, భీమేశ్వర రావ్, సుఖ్ దేవ్, స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

డీసీఎం ఢీకొని ఇద్దరికి గాయాలు



కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవరయాంజాల్‌లోని డాబర్ ఇండియా లిమిటెడ్ సమీపంలో శనివారం అతి వేగంగా వచ్చిన డీసీఎంముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి ఆపై చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న అమిత్ కుమార్, వెనుక కూర్చున్న సుభాష్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకర ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల పరిశీలన షురూ..



సర్వే నిర్వహిస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్ పాపన్న..

కుత్బుల్లాపూర్: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బీసీలకు ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది.. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో మొత్తం 4617 దరఖాస్తులు రాగా ఆయా ప్రాంతాలవారీగా విభజించి విచారణ చేపట్టారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో 3353 దరఖాస్తులు రాగా, నిజాంపేట కార్పొరేషన్‌లో 359, కొంపల్లి మున్సిపాలిటీలో 176, దుండిగల్ మున్సిపాలిటీలో 729 దరఖాస్తులు అందాయి. వాటిని ఆయా డివిజన్లు, వార్డుల వారీగా విభజించి బిల్ కలెక్టర్లు కమ్యూనిటీ ఆర్గనైజర్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు డివిజన్ ఇన్‌ఛార్జిలతో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు.. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించడంతో ప్రతిరోజు టార్గెట్‌ను నిర్దేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా లబ్ధిదారులకు ఈ పథకం వర్తించేలా ప్రభుత్వం ప్రణాళిక చేపట్టడంతో సర్వే చేస్తున్న సిబ్బంది వడివడిగా వాటిని పరిశీలిస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయాల

ముట్టడిని విజయవంతం చేయండి

నిజాంపేట్: పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన కోసం ఈ నెల 26న నిర్వహించనున్న చేపట్టిన తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా నాయకుడు నాగనిగళ్ల బాలపీరు అన్నారు. శనివారం బాచుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా పేదలకు గూడు సమకూర లేదన్నారు. ఈ నెల 26న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని, అదే పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పేద ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక మండల నాయకుడు మల్లికార్జున్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీరు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న వినోద్‌కుమార్ జాదవ్ తదితరులు

రంగారెడ్డినగర్: పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ సికింద్రాబాద్(నార్త్) అధ్యక్షుడు, బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ లయన్ వినోద్ కుమార్ జాదవ్ అన్నారు. శనివారం రంగారెడ్డినగర్ బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) ఆధ్వర్యంలో మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన పూర్వ అధ్యక్షుడు లయన్ కృష్ణ, మేడ్చల్ జిల్లా ట్రెస్మ అధ్యక్షుడు లయన్ రామేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాధారణ, గైనకాలజీ, పిడియాట్రిక్, ఎముకల, దంత, చర్మ వైద్యనిపుణులచే పాఠశాల విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ బిర్రు ఆంజనేయులు, లయన్ ఎస్.ఆర్. భాష, లయన్ రామ్ కుమార్ దేవత, లయన్ ప్రసాద్, పాఠశాల ఇంచార్జ్ ఆయేషా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ ఏ. విఠల్‌రావు పాటిల్, లయన్ మంచక్ రావు దేశముఖ్, మల్లారెడ్డి హాస్పిటల్ ఇంచార్జ్ రవికిరణ్, ఎగ్జిక్యూటివ్ లు పవన్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని హన్సికను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

జీడిమెట్ల: ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన తమ పాఠశాల పూర్వ విద్యార్థిని హన్సికను టీవీఆర్ పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అభినందించారు. 2021–22 అకాడమిక్ సంవత్సరానికి చెందిన అర్.హన్సిక పదవ తరగతి ఫలితాల్లో 10జీపీఏ పాయింట్లు సాధించింది. ఇంటర్ నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన ఆమె స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. టీవీఆర్ యాజమాన్యం శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హన్సికను అభినందించారు. ఈ సందర్భంగా హన్సికతో పాటు ఆమె తండ్రికి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, పండిత్‌జీ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్ ప్రధాన రోడ్డు మట్టితో నిండిపోయింది. సమీపంలోని నాలాలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు దుర్గంధంతో ఇబ్బందులు పడతున్నారు. దీనిపై సమాచారం అందడంతో శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బీజేపీ నాయకులు మల్లేష్, శీను, నాగేంద్ర, యాదగిరి, మల్లేష్, వినయ్, శ్రవణ్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.



వెంకన్న హిల్స్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

క్రమబద్ధీకరణ దరఖాస్తుల విచారణ ప్రారంభం

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ కోరుతూ 59 జీఓ కింద చేసుకున్న దరఖాస్తుల విచారణ శనివారం ప్రారంభమైంది. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంజీవరావు నేతృత్వంలో కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన 9 బృందాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా వారు జీఓ 59 కింద దరఖాస్తు పెట్టుకున్న వారి వివరాల సేకరణ, నిబంధనలు, రూట్ మ్యాప్ పై చర్చించారు.

- శనివారం జగద్గిరిగుట్ట, సూరారం డివిజన్ కళావతి నగర్ లో 59 దరఖాస్తులు విచారణ చేపట్టి లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- 2020 జూన్ 2 వరకు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి న్యాయపరమైన హక్కులను కల్పిస్తూ 58 ,59 కింద దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో 59 కింద 3300 మంది దరఖాస్తు చేసుకున్నారు.



బాలయ్యనగర్‌లో విచారణ చేపడుతున్న సిబ్బంది..

గతంలో ఇలా..

- 2022 లో 58, 59 జీవో కింద దరఖాస్తులను ఆహ్వానించగా 58 కింద 9331 దరఖాస్తులు అందాయి. అందులో అర్హులైన 1200 మందికి పట్టాలు పంపిణీ చేశారు. 59 కింద 14,518 దరఖాస్తులు రాగా 4032 మందిని అర్హులుగా గుర్తించారు. అందులో ఇప్పటివరకు వేయి మంది వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి.

పకడ్బందీగా విచారణ..



59 జీవో కింద అందించ దరఖాస్తులపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా పకడ్బందీగా విచారణ చేపడుతున్నాం. దరఖాస్తుదారులు దళారులను నమ్మి మోసపోవద్దు. దరఖాస్తుదారులు తమ ఇంటి వద్దకు వచ్చిన అధికారులకు సరైన పత్రాలు చూపించాలి. 59 విచారణ అనంతరం 58 జీఓ దరఖాస్తుల విచారణ చేపడతాం.

– కుత్బుల్లాపూర్ తహసీల్దార్, సంజీవరావు.

ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

కుత్బుల్లాపూర్: ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నాగేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులను మెరుగు పరచడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ఈ నెల 26న ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టును భర్తీ చేయాలనే డిమాండ్లతో బంద్ చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృత్యుంజయ పాల్గొన్నారు.